క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



నవదంపతులను ఆశీర్వదించిన సీఎం జగన్

మండపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు చోడే సత్య కృష్ణ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ దంపతులు గురువారం అమరావతిలో జగన్ నివాసంలో కలుసుకున్నారు. నవదంపతులైన ఈ రెండు జంటలు జగన్‌కు వీరాభిమానులు. జగన్‌తో ఉన్న సాన్నిహిత్యంతో ఆయనను కలుసుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

రామచంద్రపురం: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు రామచంద్రపురం పట్టణ ఎస్సై పి.వాసు గురువారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టణానికి చెందిన ఎ.తాతారావు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రామచంద్రపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పర్చగా జడ్జి వి.శ్రీనివాస నాయక్ 15 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వాసు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



సత్యనారాయణ

కె.గంగవరం: గ్రామానికి చెందిన శ్రీదేవి ఫెర్టిలైజర్స్ అధినేత నేమాని సత్యనారాయణ (పిండికొట్టు సత్తిబాబు) వరద బాధితులకు గురువారం ఆర్థిక సాయం అందించారు. ముఖ్య మంత్రి సహాయ నిధికి రూ.50 వేలు బ్యాంకు ద్వారా జమ చేశారు. ఈ సొమ్ముతో బాధితులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వర్

రామచంద్రపురం: పట్టణంలోని ద్రాక్షారామ రోడ్డు వాడపల్లి వారి వీధి సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైనట్టు ఎస్సై పి.వాసు తెలిపారు. ద్రాక్షారామ నుంచి వస్తున్న కారు, రామచంద్రపురం నుంచి ద్రాక్షారామ వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కడియాల ఈశ్వర్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించిగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసు తెలిపారు.

వానొచ్చే.. వరదొచ్చే..

- గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతి
- అదనపు జలాలు సముద్రంలోకి విడుదల
- ఆందోళన చెందుతున్న మండల ప్రజలు



కోటిపల్లిలో పుష్కరఘాట్ మెట్ల వరకూ ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

కె.గంగవరం: వాయుగుండం ప్రభావంతో ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతోంది. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వరద నీటిని కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదల చేయడంతో కోటిపల్లిలో వరద గురువారం ఉదయం నుంచి పెరుగుతోంది. గోదావరికి వరద పెరగడంతో లంకలో పశువులను రైతులు గట్టుకు చేరవేసి ఏటిగట్టుపై వాటికి ఆశ్రయం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేయడంతో ఈ రాత్రికి మరింత వరదనీరు మరింత వచ్చే అవకాశం ఉందని స్థానిక రెవెన్యూ అధికారులు చెప్పడంతో మత్స్యకార కాలనీలో ఆందోళన నెలకొంది. కొద్ది పాటి వరదకే ఏటా కోటిపల్లిలోని మత్స్యకార కాలనీ నీటమునుగుతోంది.

ముంపు గ్రామాల ప్రజలు

ఏటా గోదావరికి వరదలు వచ్చే సమయంలో మండల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలతో పాటు శేరిలంక గ్రామ ప్రజలకు కంటి మీద కునుకు ఉండదు. కూళ్ల నుంచి బ్రహ్మపూరి వరకూ ఏటిగట్టు పలు చోట్ల బలహీనంగా ఉండడంతో వారు మరింత ఆందోళనకు గురవుతున్నారు. సుందరపల్లి వద్ద ఉన్న ఏటిగట్టు ఏటా వరద వచ్చే సమయంలో కోతకు గురవుతుంది. అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్న సమయంలో ఇసుక బస్తాలు వేసి గట్టును పటిష్టం చేస్తున్నారు. మరోవైపు ఇసుక లారీలు అధిక వేగంతో వెళుతున్నందున ఏటిగట్టుపై రహదారి అధ్వానంగా మారింది. గోతులమయంగా మారి ఎక్కడ గట్టు తెగిపోతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారానికి తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోషకాహార ప్రాధాన్యాన్ని గుర్తించాలి



చోడవరంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన పోషకాహార ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు పి.వెంకటలక్ష్మి, ఐ.మాణిక్యం అన్నారు. ప్రాజెక్ట్ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో మండలంలోని వల్లూరు, వడ్లమూరు గ్రామాల్లో గురువారం పోషకాహార మాసోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. 'ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ డే' పేరుతో ఆయా గ్రామాల్లో పోషకాహారం తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఆహారమే పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఇరు గ్రామాల జీఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వడ్లమూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

పౌష్టికాహారంపై అవగాహన

రామచంద్రపురం రూరల్: చోడవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 'ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం' కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వరాహలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ, ఎంపీటీసీ సాదే సుభద్రమ్మ, ఏఎన్ఎం ఎస్.శాంతామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



సీఐ అశోక్ కుమార్

రామచంద్రపురం: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు, పందిర్ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని రామచంద్రపురం సీఐ కె.అశోక్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు. వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. చవితి పందిళ్ల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలని, మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయొద్దని సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతులు లేవని, రాత్రి పది దాటిన తరువాల మైక్‌లు ఆపివేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ కూడా తప్పక పాటించాలని, శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సీఐ కోరారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



కపిలేశ్వరపురంలో అవగాహన కల్పిస్తున్న హెచ్ఈ రామారావు

కపిలేశ్వరపురం: జ్వర పీడితులు పెరుగుతున్న నేపథ్యంలో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో వైద్య గురువారం వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాల లక్షణాలు, వ్యాధి తీవ్రతను అర్థం చేసుకునే పద్ధతులపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈ బి.రామారావు, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి ఇసుకతో గణపతి



ప్రకృతిని కాపాడే ఇసుక గణపతి

మండపేట: గణపతిని గోదావరి ఇసుకతో తయారు చేయవచ్చునని మైక్రో ఆర్టిస్ట్ దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు నిరూపించారు. అంతర్జాతీయ అవార్డు గ్రహీతైన నాగేశ్వరరావు పర్యావరణానికి అనుగుణంగా బాల గణపతిని రూపొందించారు. ఈ ఇసుక గణపతి వల్ల జలాలు కలుషితం కావని ప్రకృతికి ఆటంకాలు ఉండదని ఆయన పేర్కొన్నారు. గోదావరి ఇసుకతో తేనెపట్టు గూడు మైనం ద్రావణాన్ని ఉపయోగించి, ఉన్ని దారంతో జతచేస్తూ వెదురును ఉపయోగించి ఈ ఇసుకతో విగ్రహాన్ని తయారు చేయవచ్చన్నారు. గోదావరి ఇసుకతో విగ్రహం తయారీకి ఏడున్నర గంటలు సమయం పట్టిందని బాలనాగేశ్వరరావు వివరించారు.

చవితి వేడుకలకు ఏర్పాట్లు

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభంకానున్నాయి. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. చలువ పందిళ్లు, మంటపాలు, రంగు రంగు విద్యుద్దీపాలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల గణపతులు కొలువుదీరారు. మండపేట పట్టణం, రూరల్ గ్రామాలు ముస్తాబవుతున్నాయి. కొండపల్లి వారి వీధిలో వున్న వేగుళ్ల వారి దొడ్డి వద్ద ప్రతిష్ఠించే వినాయకుడు పట్టణంలో ప్రత్యేకం. హైదరాబాద్ నుంచి భారీ విగ్రహాన్ని కొనుగోలు చేసి ప్రత్యేక వాహనంలో మండపేట తీసుకురానున్నారు. మండపేట మెయిన్‌రోడ్డులో చవితి సామాన్ల దుకాణాలు ఏర్పాటయ్యాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఏఎన్ఎంలు

రామచంద్రపురం రూరల్: గ్రామ/వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ గురువారం డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఏఎన్ఎంలు మాట్లాడుతూ తాము అన్ని నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు, శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు, డెలివరీ కేసులు రిఫర్ అయితే జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు తీసుకువెళుతున్నామన్నారు. 82 రకాల యాప్‌ల్లో వర్క్‌ను అప్‌డేట్ చేస్తున్నామన్నారు. ఇన్ని పనులు చేస్తున్నా విధులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ తమను మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పంచాయతీరాజ్ శాఖ నుంచి తప్పించి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో కలపాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ చానల్‌ను క్లియర్‌గా తెలియజేయాలని, గత ప్రభుత్వం విడుదల చేసిన ప్రమోషన్ లిస్టును పునఃప్రారంభించాలని, ఏ డిపార్ట్‌మెంట్ కింద పరిచేయాలో పూర్తి గైడ్‌లైన్స్‌తో తెలియజేయాలని కోరారు.

దేశం హయాంలో బుడమేరును నిర్లక్ష్యం చేశారు

వైఎస్సార్ సీపీ నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మండపేట: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బుడమేరు వాగును నిర్లక్ష్యం చేశారని, 2014 నుంచి బుడమేర పరిసర ప్రాంతాల్లో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల కారణంగా కొత్త కాలనీలు వెలిశాయని దీనివల్ల ముంపు ఏర్పడిందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పల్లి శ్రీనివాస్, మందపల్లి రవికుమార్, పార్టీ నాయకులు పాలమాల సత్తిబాబు, యర్రగుంట అయ్యప్ప వివరించారు. గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ వరదలపై, ఇరిగేషన్ వ్యవస్థపై కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. దేశం నాయకులు బుడమేరు కట్టను తొలగించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారని విమర్శించారు. బుడమేరు ఆక్రమిత ప్రాంతాల్లో స్థలాలు మధ్య తరగతి ప్రజలకు అమ్మడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఒక పట్టణం మాదిరిగా కాలనీలు ఏర్పడ్డాయని వివరించారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో కట్టడాలకు ఇళ్ల నిర్మాణాలకు టీడీ ప్రభుత్వం ఏ విధంగా అనుమతి ఇచ్చిందని వారు ప్రశ్నించారు. బుడమేరు వరద కొల్లేరులో కలుస్తుందని, కొల్లేరును కూడా దేశం నాయకులు కబ్జా చేశారని, ఈ కారణంగా వరద నీరు విజయవాడలో నిలిచి పోయిందన్నారు. బుడమేరు ప్రవాహ మార్గాన్ని దేశం నాయకులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం వల్ల విజయవాడలో కొన్ని ప్రాంతాలు నీట మునిగాయిని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా నది వరద నీరు కూడా అమరావతిని ముంచేసిందని వివరించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్రంలో తుపాన్లు, వరదలు, పుష్కర ప్రమాదాలు వస్తుంటాయని గుర్తు చేశారు.

పోలీసు నీడలో ద్వారపూడి



గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మండపేట: ద్వారపూడి ఫ్లైఓవర్ దిగువన పంచాయతీ కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ఘటన వివాదాస్పదమైంది. కొందరు వ్యక్తులు కూడలిలో మంగళవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా గ్రామస్తులు ప్రతిఘటించారు. దీంతో వివాదం తారస్థాయికి చేరింది. ఈ బుధవారం రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, ఆర్డీవో సుధాకర్ హుటాహుటీన ద్వారపూడి తరలి వచ్చి ఇరువర్గాలతో సమీక్షించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బుధవారం రాత్రి తిరిగి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. అధికారులు శాంతి భద్రతల దృష్ట్యా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఒప్పుకోలేదు. దీంతో గురువారం గ్రామంలో 144 సెక్షన్ విధించారు. అయితే ఈ వివాదాన్ని రెండు సామాజిక వర్గాల వివాదంగా మార్చడానికి కొందరు రాజకీయ నాయకులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలను అదుపులో ఉన్నాయని డీఎస్పీ రామకృష్ణ తెలిపారు. రూరల్ సీఐ పీతల దొరరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు నాయకత్వంలో 100 మందికి పైగా పోలీసులు గ్రామంలో పహారా నిర్వహిస్తున్నారు.

గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం



గొల్లపాలెంలో చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కాజులూరు: గణపతి నవరాత్ర మహోత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాట ముహూర్తాలు చేశారు. గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం తదితర గ్రామాల్లో పండితులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు పందిరి రాట వేశారు. శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు మట్టా గోవిందు, ఆకుల పండు రవి, దున్నా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురు దేవోభవ !

- ఘనంగా టీచర్స్ డే
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం
- పాఠశాలల్లో గురువులకు సత్కారం



కోటిపల్లి పాఠశాలలో సర్వేపల్లి వేషధారణలో విద్యార్థి నాగబాబు

రామచంద్రపురం రూరల్: మనుషుల్లో అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించే గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని అన్నారు. రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ భవాని ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భవాని మాట్లాడుతూ ఉపాధ్యాయులు విజ్ఞాన దీపాలు వెలిగిస్తారన్నారు. మున్సిపలర్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ గురువులను గౌరవించాలని సూచించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు కేఎస్ పాపాజీ, పి.విజయలక్ష్మి, జీఆర్‌సీకే మోహన్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, వార్డు కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్, చిక్కాల స్వామికాపు, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల తర్వాత గురువే దైవం

మండపేట: ప్రపంచంలో తల్లిదండ్రుల తర్వాత గురువే దైవమని, గురువుకు ఎంతో స్థానం ఉందని శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురుపూజ మహోత్సవాన్ని వివరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వాసంశెట్టి గోవిందరాజును, ఇళ్ల నరసింహమూర్తిలను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు), ఎంపీపీ అధ్యక్షుడు వుండమట్ల శ్రీనివాస్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు తమకు విద్యను బోధించే ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కోటిపల్లి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ఆంజనేయ నాగబాబు సర్వేపల్లి రాధాకృష్ణన్ వేషధారణలో అలరించాడు.

సర్వేపల్లి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలు భావి తరాలకు ఆదర్శం కావాలని ఎంఈఓ ఎస్. డేవిడ్ సూచించారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కాజులూరు మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఎం.శ్యామ్‌సన్, పంపన కృష్ణమూర్తి, చింతా నారాయణమూర్తి, వై.శ్రీనివాసరావు కాకినాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీవైఈఓ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

రామచంద్రపురం: పట్టణంలో గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఫ్రెషర్స్ డే, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల అధినేత వీవీ రమణ, పిన్సిపాల్ వీఎస్ జాన్సీలక్ష్మి తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం

రాయవరం: అనాది కాలం నుంచి భారతీయ సంస్కృతిలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని, తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదేనని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు పేర్కొన్నారు. రాయవరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో మంగతాయారు, వెంకటరమణ మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అన్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, విద్యాదాతలు కర్రి సందీప్‌రెడ్డి, ప్రగతిరామారెడ్డి మాట్లాడారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి విగ్రహానికి పూల మాలలు వేసిన నివాళులర్పించారు. మండల స్థాయిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులు ఎనిమిది మంది ఎస్‌జీటీలను, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఎనిమది మందిని, స్కూల్ అసిస్టెంట్లతో పాటుగా సీఆర్ఎంటీ వాసంశెట్టి సీతాధనలక్ష్మిలను దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్ నేతలు దేవరకొండ సుబ్బారావు, పంపన వీరవెంకటరమణ, ఆర్.భాస్కరరావు, గొడితి మురళీకృష్ణ, దొంతంశెట్టి సతీష్ పాల్గొన్నారు.

గురుతర బాధ్యతతో మెలగాలి

కపిలేశ్వరపురం: విద్యా, బుద్ధులు నేర్పిన గురువుపై బాధ్యతతో మెలగాలని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. కపిలేశ్వరపురం, అంగర, తాతపూడి, పడమర ఖండ్రిక, వల్లూరు, వెదురుమూడి, నల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, కాలేరు, టేకి, మాచర, నాగులచెరువు, కోరుమిల్లి, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో గురువులను సత్కార కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను వివరించారు. అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ వాకా పరమేశ్వర, కరస్పాండెంట్ వాకా రాజా, చైర్మన్ డాక్టర్ వి.దివ్యశేఖర్, ప్రిన్సిపాల్ పీవీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఎదగాలన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట



రామచంద్రపురంలో విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కాకినాడలో ఎంపీ , కలెక్టర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న శ్యామ్‌సన్



కపిలేశ్వరపురంలో సర్వేపల్లి రాధాకృష్ణకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



యాకల విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ మంగతాయారు తదితరులు